# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 22 జూన్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 358

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## భంగపడ్డ భారత్


## ప్రపంచ శాంతికి ఉత్ప్రేరకంగా యోగా

### అభ్యాసం ఒక రోజుకు పరిమితం కాకూడదు

### అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

### కోల్‌కతాలో ఆసనాలు వేసిన మోదీ

యోగా అనేది ప్రపంచ ఉద్యమమని, అది దేశాల.. సాంస్కృతిక సరిహద్దులను అధిగమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేవలం ఒక్క రోజుకో, ఒక్క కార్యక్రమానికో పరిమితం చేయకుండా యోగాభ్యాసాన్ని దైనందిన జీవనంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 21 అంటే సుదీర్ఘ పగలు ఉండే రోజుగానే కాకుండా అతి పెద్ద సామాజిక వేడుక దినంగా మారిందని, దానికి యోగా కారణమని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



02

## యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

హైదరాబాద్, జూన్ 21: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం చేస్తుందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. ఆదివారం లోక్‌భవన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గవర్నర్‌తోపాటు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్, సంయుక్త కార్యదర్శి కోమండూరు శశికిరణ్, ఉప కార్యదర్శి జి.పల్లవి, లోక్‌భవన్ అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతిని ధులు యోగాసనాలు వేయించారు.





## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ కాదు..

## రెన్యువల్ సీఎం

### ఆందోళన వద్దు.. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే

### బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా

హైడ్రా, మూసీ మాటున రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడడానికి తెలంగాణ ప్రజలు సమాయత్తం కావాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం భారాస ఇన్‌ఛార్జి పి.కార్తీక్‌రెడ్డి అధ్యక్షతన శంషాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోయే వారు ఆందోళన చెందవద్దని, రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు.

హైదరాబాద్, జూన్ 21: రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, రెన్యువల్ సీఎం అని ఎద్దేవా చేశారు. "ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతున్న సర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) సర్వేలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. అర్హులైన వారివి ఒక్క ఓటు కూడా చేజారొద్దు. అక్టోబరు 1న తుది ఓటరు జాబితా విడుదల చేసే వరకు నాయకులు, ఓటర్లు అప్రమత్తంగా ఉండాల"ని దిశానిర్దేశం చేశారు. "రాజేంద్రనగర్‌లోని 580 బూత్‌లలో ప్రణాళికాబద్ధంగా పనులు చేయండి. ఈగోలు వదిలేసి పోలింగ్ బూత్‌స్థాయిలో సమన్వయంతో యుద్ధం చేయాలి. లేకపోతే ఎంత పెద్ద నాయకులైనా వృథా. దండం పెట్టి చెబుతున్నా.. నేల విడిచి సాము చేయొద్దు. పార్టీకి నష్టం జరుగుతుంది. ఈ ప్రభుత్వ

మిగతా 2 లో

## ఢిల్లీ బాటలో సీఎం రేవంత్‌రెడ్డి

### మెట్రో అనుమతులపై కేంద్రంతో తేల్చుకునేందుకు సిద్ధం

### ఎస్‌బీఐ భూవివాదంపై ఆర్థిక మంత్రికి ఫిర్యాదు చేసే అవకాశం..

### హైకమాండ్‌తో మంతనాలు

రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టారు. ఆదివారం రాత్రి ముంబై మీదుగా హస్తినకు చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి కేంద్ర మంత్రులతో కీలక చర్చలు జరపనున్నారు.



న్యూఢిల్లీ, జూన్ 21: హైదరాబాద్ మెట్రో ఫేజ్--2 విస్తరణ, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై కేంద్రంతో నేరుగా తేల్చుకోవాలని ఆయన భావిస్తున్నారు. మెట్రో రైలు పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రేవంత్ ఇప్పటికే లేఖ రాసిన విషయం తెలిసిందే. 'ఈ నెల 22, 23 తేదీల్లో నేను ఢిల్లీలోనే అందుబాటులో ఉంటాను. మీరు చొరవ తీసుకుని రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేయండి'అని రేవంత్ లేఖలో కోరారు. అలాగే, రాయదుర్గంలో ఎస్‌బీఐ భూమి వేలం వివాదానికి సంబంధించి రేవంత్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసే అవకాశం ఉంది. ఈ భేటీలో ఎస్‌బీఐ చైర్మన్‌పై ఆయన ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వపరమైన పనులతోపాటు, రాష్ట్ర రాజకీయాల పైనా సీఎం దృష్టి సారించనున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలను కలవనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ, పార్టీ రాజకీయ పరిణామాలపై వారితో చర్చించే అవకాశం ఉంది.




## ప్రశాంతంగా నీట్ రీ-ఎగ్జామ్

### రాష్ట్రంలో 89.09 శాతం అభ్యర్థులు హాజరు

దేశవ్యాప్తంగా ఆదివారం 'నీట్' రీ-ఎగ్జామ్ ప్రశాంతంగా జరిగింది. రాష్ట్రంలో 89.09 శాతం అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మే 3న జరిగిన పరీక్షతో పోలిస్తే ఈసారి 8.55 శాతం హాజరు తగ్గడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా 24 పట్టణాల్లోని 208 కేంద్రాల్లో నీట్ నిర్వహించారు. మొత్తం 73,059 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 65,087 మంది హాజరయ్యారు. పలువురు విద్యార్థులు కొద్ది ఆలస్యంతో పరీక్ష కేంద్రాలకు చేరుకుని.. అనుమతించాలంటూ సిబ్బందిని ప్రాధేయపడి నిరాశతో వెనుదిరిగారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ డైరెక్టర్ కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని పరీక్ష కేంద్రాలతో అనుసంధానం చేసిన నీట్ - యూజీ 2026 కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు.

హైదరాబాద్, జూన్ 21: మే 3న జరిగిన పరీక్షతో పోల్చుకుంటే ఆదివారం జరిగిన రీ-ఎగ్జామ్ ప్రశ్న పత్రంలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో స్కోరింగ్ చేసే అవకాశం తక్కువగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బయాలజీలో మాత్రం స్కోరింగ్‌కు అవకాశం ఉందని చెబుతున్నారు. 'ఫిజిక్స్‌లో ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకునే విధంగా ఉన్నాయి. 4 నుంచి 5 ప్రశ్నలు అయోమయానికి గురిచేసే విధంగా ఉన్నాయి. కెమిస్ట్రీలో న్యూమరికల్, మెమరీ బేస్డ్ ప్రశ్నలు అధిక సంఖ్యలో ఉన్నాయి' అని హైదరాబాద్‌కు చెందిన విద్యా నిపుణుడు కె.రవీంద్రకుమార్ అభిప్రాయపడ్డారు. బయాలజీ ప్రశ్నపత్రం సులువుగా ఉందని.. ఫిజిక్స్,

మిగతా 2 లో

## జీరాంజీపై ఇతర రాష్ట్రాలతో కలిసి పోరాడతాం

### అవసరమైతే సుప్రీంకోర్టుకెళ్తాం: మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, జూన్ 21: కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి అమలు చేయనున్న జీరాంజీకి వ్యతిరేకంగా భాజపాయేతర పార్టీలు పాలించే రాష్ట్రాలతో కలిసి ఉమ్మడిగా పోరాడాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును

మిగతా 2 లో





## రాహుల్ అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే గ్యారంటీలపై వినతులిస్తాం

రైతు భరోసా కింద రూ.15 వేలు రావడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. విద్యా భరోసా కింద ఇస్తామన్న రూ.5 లక్షల సహాయం ఇంకా కార్యరూపం దాల్చలేదు. రాహుల్‌గాంధీ పదేపదే నిరుద్యోగులకు ఇచ్చిన హామీ..

## నాపై కుట్ర చేయాల్సిన అవసరం పార్టీలో ఎవరికీ లేదు

### వంచనలో భాగంగానే భాజపా మూడో అభ్యర్థిని నిలిపింది : మీనాక్షి

హైదరాబాద్, జూన్ 21: రాజ్యసభ ఎన్నికల్లో తన నామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా కాంగ్రెస్‌లో ఎలాంటి కుట్రా జరగలేదని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టంచేశారు. పార్టీలో తనపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి సచిన్ సావంత్‌లతో కలిసి ఆదివారం ఆమె గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. "మధ్యప్రదేశ్‌లో 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మెజార్టీ లేకపోయినా ఫౌల్ గేమ్ ప్లాన్‌తోనే భాజపా మూడో అభ్యర్థిని బరిలో దింపింది. డబ్బులు,

-మిగతా 2 లో..



## టీజీ20 లీగ్ ఆరంభం

### లీగ్ ప్రచారకర్త విజయ్ దేవరకొండ సందడి

### హోరెత్తించిన తమన్ సంగీతం.. పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



02

## ప్రశాంతంగా నీట్ రీ-ఎగ్జామ్

(మొదటిపేజీ తరువాయి)

కెమిస్ట్రీ కఠినంగా ఉన్నాయని శ్రీచైతన్య కళాశాల కూకట్‌పల్లి బ్రాంచ్ డీన్ శంకర్‌రావు విశ్లేషించారు. అత్యధిక స్కోరింగ్ మార్కులు, కటాఫ్ ఈ సారి తగ్గే అవకాశం ఉందన్నారు. టాపర్లకు 700 నుంచి 710 మధ్య మార్కులు రావొచ్చని.. ఇక రాష్ట్రంలో 420 కటాఫ్ మార్కులకు జనరల్ కేటగిరీలో సీటొచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. అచ్చంపేటకు చెందిన జండావత్ నరేందర్ ఆదివారం రంగారెడ్డి జిల్లా రాగన్నగూడలోని జడ్పీహెచ్ఎస్ కేంద్రంలో నీట్‌కు హాజరయ్యాడు. ఇన్విజిలేటర్లు ప్రశ్నపత్రాలు ఇచ్చిన తర్వాత కొద్దిసేపు గదిలోనే ఉన్న నరేందర్.. తర్వాత శౌచాలయానికి వెళ్లాడు. 10 నిమిషాల కంటే ఎక్కువ సమయం గడిచినా.. తిరిగి రాకపోవడంతో ఇన్విజిలేటర్‌కు అనుమానమొచ్చింది. ఇతర అధికారులతో కలిసి శౌచాలయానికి వెళ్లి తనిఖీ చేయగా.. నరేందర్ సెల్‌ఫోన్ వినియోగిస్తూ కనిపించాడు. గూగుల్‌లో సమాధానాల కోసం వెతుకుతున్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే అదుపులోకి తీసుకుని ఆదిభట్ల పోలీసులకు అప్పగించగా.. మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకే పరీక్ష కేంద్రానికి వెళ్లి.. బాత్‌రూమ్‌లోని ఫ్లష్‌ట్యాంకులో ఫోన్ దాచిపెట్టినట్లు ఆ విద్యార్థి ఒప్పుకొన్నాడని పోలీసులు తెలిపారు.



## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ కాదు.. రెన్యువల్ సీఎం

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో హైదరాబాద్‌లో పారిశ్రామికవేత్తల తలలపై తుపాకులు పెట్టి డబ్బులు ఇస్తావా.. చస్తావా అంటూ కొందరు బెదిరిస్తున్నారు. ఇలాంటి దౌర్జన్యాలు సీఎం కార్యాలయానికి సమీపంలోనే జరుగుతుండడం విచారకరం. రాజధానిలో రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. కేసీఆర్ పాలనలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న 2.50 లక్షల మంది పేదలకు జీవో 58, 59లకు లోబడి పట్టాలిచ్చాం. ఇప్పుడు రేవంత్ సర్కారు పేదల ఇళ్లు కూల్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. రైతులకు ధాన్యం సంచులు కూడా ఇవ్వలేని దయనీయ స్థితిలో పాలన కొనసాగుతోంది" అని విమర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ రాజేంద్రనగర్‌లోని హనుమాన్ బస్తీని సందర్శించారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోతున్న బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి పి.సబితారెడ్డి, జిల్లా భారాస అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నాపై కుట్ర చేయాల్సిన అవసరం పార్టీలో ఎవరికీ లేదు

(మొదటిపేజీ తరువాయి)

బెదిరింపులతో మూడో స్థానం గెలవలేమని భాజపా చివర్లో గ్రహించింది. నా నామినేషన్ ఆమోదం విషయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎలక్షన్ కమిషన్ భాజపాతో రాజీపడ్డాయి. ఆ కేసులో నాకు నోటీసిచ్చిన సమాచారం తెలంగాణలో ఎవరైనా ఎందుకు లీక్ చేస్తారు?. ఆర్ఓ భాజపాతో రాజీపడి నా నామినేషన్‌ను తిరస్కరించారు. నాపై కుట్ర చేశారనే వదంతులు నామినేషన్ తిరస్కరణకు ఒకరోజు ముందు నుంచే భాజపా ప్రచారం చేసింది. తెలంగాణలో ఎవరూ నా కోసం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం లేదు. ఎవరో నా కోసం రాజీనామా చేస్తున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. నా రాజకీయం మధ్యప్రదేశ్‌లో ఉంటుంది. ప్రస్తుతం పదవిలో ఉన్న రాజ్యసభ సభ్యుడిని రాజీనామా చేయించి ఆ స్థానం తీసుకునే అవసరం నాకు లేదు. నాపై క్రిమినల్ కేసులు లేవు. కేవలం నోటీసు ఇచ్చారు. నామినేషన్‌లో ఇలాంటి కేసుల వివరాలు తెలపాల్సిన అవసరం లేదు. ఆ కేసు నేను తెలంగాణ రాష్ట్రానికి ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా వెళ్లకముందుదని ఆర్ఓకు చెప్పాను. కుంభం శివకుమార్‌పై వచ్చిన ఫిర్యాదు అంశం సీరియస్ అని గ్రహించే ఆయనకు ఎన్నికల్లో నారాయణపేట టికెట్ ఇవ్వలేదు. అయినా ఇప్పటివరకూ ఆ కేసులో ఏమీ రుజువుకాలేదు. ఒక వ్యక్తిపై అభియోగాలుంటే కుటుంబంలోని వారికి టికెట్ ఇవ్వకూడదని ఎక్కడా లేదు. నా నామినేషన్ తిరస్కరణ విషయంలో మేం ఒక్క నిమిషం కూడా నిరాశ చెందలేదు. భాజపా ఎలాంటి రాజకీయం చేసిందో దేశానికి చూపించాం. ఓటు చోరీ, సీటు చోరీ జరుగుతోందని రెండేళ్ల నుంచి రాహుల్ గాంధీ చెబుతున్నారు" అని మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు.

## పచ్చని కుటుంబంలో బెట్టింగ్ చిచ్చు

### పిల్లలిద్దరికీ ఎలుకల మందు తినిపించి.. తానూ తిన్న మహిళ

### ఇద్దరు కుమారుల మృతి.. ప్రాణాపాయ స్థితిలో తల్లి

**ఖమ్మం:** మద్యం, బెట్టింగ్ భూతం నిండు కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేశాయి. ఆర్థిక సమస్యలకు కుటుంబ కలహాలు తోడవడంతో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలకు ఎలుకల మందు తినిపించి, ఆపై తానూ తిని బలవన్మరణానికి యత్నించారు. ఈ విషాద ఘటనలో పిల్లలిద్దరూ చనిపోగా, తల్లి మృత్యువుతో పోరాడుతున్నారు. ఖమ్మం మూడో పట్టణ సీఐ మోహన్‌బాబు కథనం ప్రకారం.. ఏదులాపురం మున్సిపాలిటీ గుర్రాలపాడుకు చెందిన బొబ్బాల లింగరాజుకు చింతకాని మండలం నరసింహాపురానికి చెందిన దొడ్డ పూర్ణయ్య కుమార్తె స్వాతి(26)తో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారులు వేదిక్ కుమార్(7), తనుష్(5) ఉన్నారు. లింగరాజు పాలవ్యాపారం, ఖమ్మంలోని ఓ మొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. బీటెక్ చదివిన స్వాతి ఇంటి వద్దే ఉంటున్నారు. వీరు ఖమ్మంలోని గాంధీనగర్ ప్రాంతంలో ఉంటూ పిల్లలను చదివిస్తున్నారు. మద్యానికి, బెట్టింగ్‌కు బానిసైన లింగరాజు.. ఇటీవల కొంత నగదు పోగొట్టుకున్నాడు. దీంతో స్వాతి తండ్రి రూ.1.5 లక్షలు ఇవ్వగా.. లింగరాజు ఆ మొత్తాన్ని సైతం బెట్టింగ్‌లో పోగొట్టాడు. లింగరాజు బెట్టింగ్‌లో సుమారు రూ.3లక్షల వరకు నష్టపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో గుర్రాలపాడు వెళ్లి ఉండాలని స్వాతి దంపతులకు రెండు కుటుంబాల వారు సూచించారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి సమయంలో పెద్దకుమారుడు వేదిక్ తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో బాధపడుతుండగా.. ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడే మృతి చెందాడు. ఈలోగా చిన్నకుమారుడు తనుష్ కూడా అస్వస్థతకు గురికావడంతో లింగరాజు భార్యను ఏమైందని అడిగాడు. తాను ఎలుకల మందు తిని, పిల్లలిద్దరికీ తినిపించినట్లు స్వాతి చెప్పడంతో వారిని హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ ఆదివారం తనుష్ మృతి చెందగా.. స్వాతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బెట్టింగులకు అలవాటుపడిన అల్లుడు లింగరాజు వేధింపులతో మనస్తాపం చెందిన తన కుమార్తె ఈ అఘాయిత్యానికి పాల్పడిందంటూ పూర్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# జీరాంజీపై ఇతర రాష్ట్రాలతో కలిసి పోరాడతాం

(మొదటిపేజీ తరువాయి)


ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని అభిప్రాయపడింది. పథకంపై ప్రభుత్వానికి సమగ్ర సిఫార్సులు అందించేందుకు అంశాలవారీగా అధ్యయనం కొనసాగించాలని గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తుది నివేదిక రూపొందించాలని తీర్మానించింది. ఆదివారం పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం జరిగింది. పంచాయతీ రాజ్, వ్యవసాయ, కార్మికశాఖల మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త చట్టం వల్ల గ్రామీణుల ఉపాధి, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలపై చర్చించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధిపై చట్టం ప్రభావం వంటి అంశాల గురించి అధికారులు వివరించారు. కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం అమలు సాధ్యం కాదని మంత్రులు అన్నారు. దీనివల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు కూలి రేట్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం 40% నిధుల భారాన్ని మోపడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు భాజపాయేతర పార్టీల పాలనలో



ఉన్న రాష్ట్రాలతోనూ సంప్రదింపులు జరపాలని సమావేశం నిర్ణయించింది. మరో రెండు మూడు రోజుల్లో సబ్ కమిటీ మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించాలని నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ "ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు కల్పించిన హక్కులను క్రమంగా నిర్వీర్యం చేసి, రాష్ట్రాల అధికారాలను హరించేందుకు కేంద్రం కుట్రపూరితంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకొస్తోంది. దీనిని అడ్డుకుంటాం. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం దేశ చరిత్రను అవమానించడమే. రాంజీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

# టీజీ20 లీగ్ ఆరంభం

- లీగ్ ప్రచారకర్త విజయ్ దేవరకొండ సందడి
- హోరెత్తించిన తమన్ సంగీతం
- పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, జూన్ 21:** టీజీ20 ఆరంభ వేడుకలు అభిమానులను ఆకట్టుకున్నాయి. తొలి మ్యాచ్ ముంగిట అభిమానులతో నిండిపోయిన ఉప్పల్ స్టేడియంలో తారల తళుకుల మధ్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట టీజీ20 ట్రోఫీని మైదానంలోకి తీసుకురాగా.. తర్వాత ఎనిమిది జట్ల జట్ల ఆటగాళ్లు, ఫ్రాంఛైజీ యాజమానులు వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరినాథ్, టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగంరావు, హెచ్‌సీఏ ఆపరేషన్స్ హెడ్ అంబటి రాయుడు, మహ్మద్ సిరాజ్, హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్‌రెడ్డి, టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు సంజీవ్ రెడ్డి అతిథులుగా ఆరంభ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు విక్రమార్క మాట్లాడుతూ.. "తెలంగాణలోని యువ క్రీడాకారులందరికీ ఇది గొప్ప వేదిక. టోర్నీ నిర్వాహకులకు నా అభినందనలు. అందరూ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. క్రీడాకారుల



ఎదుగుదలకు తెలంగాణ ప్రభుత్వ సహకారం ఎప్పటికీ ఉంటుంది" అని అన్నారు. టీజీ20 బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "నా చిన్నప్పుడు కర్ణాటక నుంచి భారత్‌కు నలుగురు ప్రాతినిధ్యం వహించేవారు. తెలంగాణ నుంచి వీవీఎస్ లక్ష్మణ్ మాత్రమే ఉండేవారు. కానీ ఇప్పుడు తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్ లాంటి వారు భారత్‌కు ఆడుతున్నారు. తెలంగాణ నుంచి మరింత మంది జాతీయ జట్టుకు ఆడాలనేది నా ఆకాంక్ష. అందుకు ఈ లీగ్ దోహదపడుతుందని ఆశిస్తున్నా" అన్నారు. టీజీ20 లీగ్ అధికారిక టోర్నమెంట్ అని బీసీసీఐ ఈ లీగ్‌కు అనుమతి ఇచ్చిందని బోర్డు అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండీశ్వరీనాథ్ తెలిపారు. అనంతరం సినీ సంగీత దర్శకుడు ఎస్.ఎస్.తమన్ తన ప్రదర్శనతో అభిమానులను అలరించాడు. మధ్యలో లేజర్, క్రాకర్స్ షోలు కూడా జరిగాయి. టీజీ20 ఆరంభ వేడుకల్లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ ప్రతినిధులుగా ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, ఈటీవీ డైరెక్టర్ సుజయ్ పాల్గొన్నారు.



## గల్ఫ్‌లో పర్యటించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సుముఖత

**హైదరాబాద్:** గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల ఓటు హక్కుల పరిరక్షణపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ ప్రతినిధులు ఆదివారం చర్చించారు. తెలంగాణ రాష్ట్ర 'గల్ఫ్ కాంగ్రెస్' ప్రతినిధి సుతారి సత్యనారాయణ పటేల్, తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి ఆదివారం హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమం వేళ.. విదేశాల్లో నివసిస్తున్న గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగింపునకు తీసుకోవాల్సిన చర్యలపై పొన్నం ప్రభాకర్‌తో వారు చర్చించారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్న తెలంగాణకు చెందిన గల్ఫ్ కార్మికులు, ఎన్నారైలు తమ ఓటరు నమోదును కొనసాగించుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆన్‌లైన్ జూమ్ సమావేశాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రతిపాదనలను మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్వీకరించినట్లు వారు తెలిపారు. అలాగే తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు, గల్ఫ్ కార్మికులతో ప్రత్యక్షంగా మమేకమయ్యేందుకు గల్ఫ్ దేశాల్లో పర్యటించాల్సిందిగా మంత్రిని ఆహ్వానించారు. స్వయంగా గల్ఫ్ దేశాల్లో పర్యటించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సుముఖత వ్యక్తం చేశారు.

# ప్రపంచ శాంతికి ఉత్ప్రేరకంగా యోగా

**కోల్‌కతా:** యోగా అనేది ప్రపంచ ఉద్యమమని, అది దేశాల.. సాంస్కృతిక సరిహద్దులను అధిగమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేవలం ఒక్క రోజుకో, ఒక్క కార్యక్రమానికో పరిమితం చేయకుండా యోగాభ్యాసాన్ని దైనందిన జీవనంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 21 అంటే సుదీర్ఘ పగలు ఉండే రోజుగానే కాకుండా అతి పెద్ద సామాజిక వేడుక దినంగా మారిందని, దానికి యోగా కారణమని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోల్‌కతాతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో భారీగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రులు, ఆయా రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, వివిధ వర్గాలవారు, దౌత్యవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోల్‌కతా కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ- వ్యక్తిగత ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికే కాకుండా ప్రపంచ శాంతికి ఉత్ప్రేరకంగా యోగా నిలుస్తుందని చెప్పారు. 'ప్రాచీన భారతీయ అభ్యాసమైన యోగావల్ల శారీరక ఆరోగ్యానికి మించిన ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. పనిని, పోషకాహారాన్ని, నిద్రను మనం సమతుల్యం చేసుకోవాలి. ఆధునిక జీవనశైలిలో దీనికి కొంత అవాంతరం వాటిల్లుతుంటుంది. ఏం చేయాలి.. ఏం చేయకూడదు.. జీవితాన్ని ఎలా సంతులనం చేసుకోవాలనేది యోగా మనకు చెబుతుంది. మన శరీరాన్ని ఎలా మలచుకోవాలో తెలిస్తే ఆరోగ్యం ఒక అలవాటుగా మారిపోతుంది. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆత్మ చైతన్యాలకు యోగా ఉపయోగపడుతుంది. ఏం చేయకూడదనే చైతన్యం మనలో వచ్చినప్పుడు ప్రపంచ శాంతికీ అది దారులు తెరుస్తుంది. అందుకే మన జీవన విధానానికే కాకుండా ప్రపంచ భవితవ్యం మెరుగయ్యేందుకూ ఇది అవసరం. అందుకే జీవితకాలమంతా దీనిని మనం, మన కుటుంబాలు, భవిష్యతరాలు అభ్యసించాలి. ప్రజల్ని దగ్గర చేయడానికి యోగా దారి చూపిస్తుంది. శారీరకంగానే కాకుండా అన్నివిధాలా, అన్ని వయసుల వారికీ ఇది ప్రయోజనం కలిగిస్తుంది.



మానవాళి ఐక్యతను ప్రోది చేస్తుంది' అని ప్రధాని చెప్పారు. తెల్లని దుస్తుల్లో కార్యక్రమానికి హాజరైన మోదీ.. వేలమంది ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. 40 నిమిషాలపాటు కొనసాగిన కార్యక్రమంలో ఆయన ప్రజల మధ్యకు వెళ్లి వారు యోగాభ్యాసం చేస్తున్న తీరును స్వయంగా గమనించారు. కొందరు సరైన భంగిమలో ఆసనాలు చేసేలా ఆయన సహకారం అందించారు.

వేగుచుక్క

# యోగాసనాలలో మానసిక దివ్యాంగులు సైతం.



స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగుల పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

మానసిక దివ్యాంగులు , అంద విద్యార్థులైనప్పటికీ యోగాసనాలు వేసిన తీరు ఎంతో అబ్బురపరిచిందని పలువురు వక్తలు కొనియాడారు.. ప్రతి మనిషికి ఆరోగ్య సంరక్షణలో యోగ చాలా కీలకమని వారు తెలిపారు.. ఇంతమంది మానసిక దివ్యాంగ విద్యార్థుల ఉన్నతికి యోగ దోహదపడుతుందని గుర్తించి శిక్షణనివ్వడం అభినందించదగ్గ విషయం అన్నారు... నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.. ఈ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా మానసిక దివ్యాంగుల, అంద విద్యార్థులు యోగాసనాలు వేశారు... ఈ యోగాసనాలను తిలకించిన ప్రముఖులు ధారం గంగాధర్, రామ్ కిషన్ రావు, నగేష్ గురుస్వామి, ఎక్స్ సర్వీస్ మెన్ పోతన్న లు మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా ఎంతో కీలకమన్నారు.. ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక శారీరక ప్రశాంతత కోసం యోగా పాత్ర కీలకమన్నారు.. ఈ యోగాసనాల విశిష్టత గురించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలియపరచినప్పటికీ కూడా చాలామంది సకలాంగులు యోగాసనాలు వేయకుండా అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. కానీ స్నేహ సొసైటీ దివ్యాంగ పాఠశాలలో మానసిక దివ్యాంగ విద్యార్థుల వారి ఆరోగ్య రీత్యా, ఉన్నతికి యోగ అతి ముఖ్యమని గుర్తించి స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి కార్యదర్శి సిద్దయ్యలు ప్రత్యేకంగా యోగా ఉపాధ్యాయురాలు వీణ ద్వారా విద్యార్థులకు యోగాసనాలు వేయించడం ఎంతో అభినందనీయమన్నారు.అలాగే ఇప్పటికీ 72 సంవత్సరాలు గడిచినప్పటికీ యోగాసనాలు నిత్యం వేయడం జరుగుతుందని రాంకిషన్ రావ్, దారం గంగాధర్ లు తెలియపరిచారు.. ప్రతి ఒక్కరు నిత్యం యోగా



చేయడం ద్వారా మానసిక శారీరక ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో దారం గంగాధర్, పోతంగల్ రామ్ కిషన్ రావు, నగేష్ గురుస్వామి, ఎస్. సిద్దయ్య, కార్యదర్శి, స్నేహ సొసైటీ, సాయినాథ్ స్వామి, పోతన్న ఎక్స్ సర్వీస్ మెన్ , తాటి వీరేశం, సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి, ప్రిన్సిపాల్ రాజేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.



# ఇందూరు...యోగా గురువులకు నిలయం

**యోగా సాధనతో ఒత్తిడి..ఆందోళన దూరం..**

**బీజేపీ ఇందూరు శాఖ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే...**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



ఇందూరు జిల్లా యోగా గురువులకు నిలయమని, అనేకమంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ సత్తా చాటారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... యోగా అంటే శరీర వ్యాయామం కాదని జీవన విజ్ఞానం అన్నారు. వ్యక్తిత్వం ఆలోచన విధానం సమాజం ప్రకృతి మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా యోగ బలపరుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా కోసం సమయం కేటాయించాలన్నారు. ప్రధానంగా యోగా సాధన ద్వారా సహనం క్రమశిక్షణ పరస్పర గౌరవం వంటి విలువలు పెరుగుతాయి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి,19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీ నారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు జగదీష్ కులకర్ణి , చింతకాయల రాజేందర్, మల్కాయి మహేందర్, సీనియర్ నాయకులు న్యాలం రాజు, ఇప్పకాయల కిషోర్, మురళీ, బొబ్బిలి వేణు, శ్రీనివాస్, ఇల్లెందుల ప్రభాకర్, కృష్ణ, బి.శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కో- కోశాధికారి విజయ్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం కమాల్

## చెలరేగిన కచ్చి, హిమతేజ, సాయికృష్ణ

## తొలి మ్యాచ్‌లో పాలమూరుపై విజయం




**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ సంఘం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన టీజీ20 లీగ్‌లో తొలి మ్యాచ్ అదిరిపోయింది. ఆదివారం పరుగులతో ఉప్పల్ స్టేడియం పోటెత్తింది. మొదట వాఫి కచ్చి (60; 30 బంతుల్లో 11x4, 1x6), హిమతేజ (59 నాటౌట్; 24 బంతుల్లో 1x4, 7x6), సాయికృష్ణారెడ్డి (52; 32 బంతుల్లో 3x4, 4x6) భీకర హిట్టింగ్‌తో ఖమ్మం నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 237 పరుగులు చేసింది. ఛేదనలో విష్ణేశ్ రెడ్డి (86; 31 బంతుల్లో 8x4, 7x6) బలమైన పునాదే వేసినప్పటికీ.. లక్ష్యం మరీ పెద్దది కావడంతో పాలమూరుకు ఓటమి తప్పలేదు. ఆ జట్టు 6 వికెట్లకు 217 పరుగులే చేసింది. ఖమ్మం బౌలర్లలో వేద్ రెడ్డి (2/42), విద్యానంద రెడ్డి (1/31) రాణించారు. ఛేదనలో విష్ణేశ్ రెడ్డి బ్యాటింగ్ ఇన్నింగ్స్‌కే కాదు మ్యాచ్‌కే హైలైట్. భారీ లక్ష్యం ముందున్నా ఈ పాలమూరు ఓపెనర్ ఏమాత్రం ఒత్తిడికి గురవలేదు. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మూడో ఓవర్లో విష్ణేశ్ రెడ్డి 3 ఫోర్లు, ఒక సిక్స్ బాదడంతో 23 పరుగులొచ్చాయి. మరో బ్యాటర్ చైతన్య స్ట్రైక్ రొటేట్ చేస్తుంటే.. విష్ణేశ్ విధ్వంసం సృష్టించడంతో పాలమూరు 6 ఓవర్లకు 85/0తో లక్ష్యం దిశగా సాగింది. ఈలోపే విష్ణేశ్ 50 పూర్తి చేసుకున్నాడు. జట్టు స్కోరు 119 వద్ద అతను భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగాన్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అయినప్పటికీ 10 ఓవర్లకు పాలమూరు 133/1తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే కెప్టెన్ ప్రజ్ఞయ్ రెడ్డి (15), చైతన్య (35) వరుస ఓవర్లలో పెవిలియన్ చేరడం.. పరుగుల వేగం తగ్గడంతో పాలమూరు ఒత్తిడిలో పడింది. 16 ఓవర్లకు స్కోరు 180/4. నాలుగు ఓవర్లలో పాలమూరు విజయానికి 58 పరుగులు అవసరం కాగా.. ఖమ్మం బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసి జట్టును గెలిపించారు. మొదట టాస్ గెలిచిన పాలమూరు స్ట్రైకర్స్.. అన్విత ఖమ్మం ఏసెస్‌కు బ్యాటింగ్ అప్పగించింది. అయితే పాలమూరు తీసుకున్న నిర్ణయం సరైనదేనా అనేలా ఖమ్మం బ్యాటింగ్ సాగింది. ఆ జట్టు ఆరంభం అదిరిపోయింది. తొలి ఓవర్లోనే 15 పరుగులు వచ్చాయి. రవి కిరణ్ వేసిన వేసిన రెండో ఓవర్లో సాయి కృష్ణారెడ్డి మూడు సిక్సర్లతో చెలరేగాడు. మరోవైపు వాఫి కచ్చి బౌండరీల మోత మోగించడంతో ఏసెస్ స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఆ జట్టు పవర్‌ప్లేలో వికెట్ కోల్పోకుండా 67 పరుగులు సాధించింది. ఆ తర్వాత ఈ ద్వయం మరింత రెచ్చిపోయింది. ఈ క్రమంలో వాఫి అర్ధసెంచరీ చేశాడు. అయితే తొమ్మిదో ఓవర్లో నిపుణ్.. కచ్చిని ఔట్ చేసి పాలమూరుకు బ్రేక్ అందించాడు. సగం ఇన్నింగ్స్ ముగిసేసరికి ఖమ్మం 113/1తో భారీ స్కోరు దిశగా నడిచింది. అర్ధశతకం సాధించిన సాయికృష్ణారెడ్డి కొద్ది సేపటికే పెవిలియన్ చేరాడు. కానీ మూడో నంబర్ బ్యాటర్ హిమతేజ రెచ్చిపోయి స్కోరు వేగం తగ్గకుండా చూశాడు. అతడికి ప్రతీక్ రెడ్డి (25) సహకారం అందించాడు. అర్ధశతకం పూర్తి చేసిన హిమతేజ చివరి వరకు క్రీజులో ఉండి జట్టుకు భారీ స్కోరు సాధించిపెట్టాడు. కెప్టెన్ చామా మిలింద్ (18) కూడా చివర్లో రెండు షాట్లు ఆడాడు. ఖమ్మం ఇన్నింగ్స్‌లో 16 సిక్సర్లు నమోదయ్యాయి.



# భంగపడ్డ భారత్

## దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి

## చెలరేగిన కాప్

## మహిళల టీ20 ప్రపంచకప్

**మాంచెస్టర్:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు భంగపాటు. ఆదివారం జరిగిన మ్యాచ్ (గ్రూప్-1)లో ఆ జట్టు 6 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయింది. మొదట భారత్ 7 వికెట్లకు 158 పరుగులే చేయగలిగింది.షెఫాలి వర్మ (31; 15 బంతుల్లో 4x4, 1x6) మరిజేన్ కాప్ (2/27), షబ్నిమ్ (2/28) ఆ జట్టును కట్టడి చేశారు. కాప్ (81 నాటౌట్; 45 బంతుల్లో 7x4, 4x6) చెలరేగడంతో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తజ్మిన్ బ్రిట్స్ (40; 36 బంతుల్లో 2x4, 1x6) రాణించింది. శ్రీచరణి (3/24) గొప్పగా బౌలింగ్ చేసినా ఫలితం లేకపోయింది. ఇక భారత్ సెమీస్ చేరాలంటే బలమైన ఆస్ట్రేలియాపై తప్పక నెగ్గాల్సిన స్థితికి చేరుకుంది. ఛేదన ఆరంభంలో భారత్‌దే పైచేయి. పవర్‌ప్లే ముగిసేసరికి దక్షిణాఫ్రికాను 25/2కే పరిమితం చేసింది. స్పిన్నర్ శ్రీచరణి రెండు ఓవర్లలో రెండు పరుగులే ఇచ్చి వోల్వార్ట్ (20), డెర్క్‌సెన్ (0)లను ఔట్ చేసింది. కానీ మారిజేన్ కాప్ అదిరే బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికాను ఆదుకుంది.. ధాటిగా ఆడిన ఆమె.. బ్రిట్స్‌తో మూడో వికెట్‌కు వేగంగా 97 పరుగులు జోడించి దక్షిణాఫ్రికాను విజయం దిశగా నడిపించింది. 16 ఓవర్లకు దక్షిణాఫ్రికా 122/2తో నిలిచింది. 17వ ఓవర్లో బ్రిట్స్‌ను షెఫాలి ఔట్ చేయడంతో భారత్‌కు కాస్త ఆశ కలిగింది. తర్వాతి ఓవర్లో శ్రీచరణి 11 పరుగులిచ్చినా.. నదైన్‌ను ఔట్ చేసింది. కానీ మరోవైపు కాప్ జోరు కొనసాగించడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత.. స్మృతి మంధాన (17) త్వరగానే నిష్క్రమించినప్పటికీ 5 ఓవర్లు ముగిసే సరికి ఆ జట్టు 52/1తో బలమైన స్థితిలోనే నిలిచింది. కానీ 30 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. షెఫాలి, యాస్తిక (15), జెమీమా (12) చకచకా పెవిలియన్ బాట పట్టారు. 11వ ఓవర్లో జెమీమా ఔటయ్యేటప్పటికి స్కోరు 83. ఆ దశలో హర్మన్‌ప్రీత్ కౌర్ (24; 22 బంతుల్లో 2x4), దీప్తి శర్మ (29; 21 బంతుల్లో 3x4) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయిదో వికెట్‌కు 33 పరుగులు జోడించారు. కానీ పరుగులు అంత వేగంగా రాలేదు. 15వ ఓవర్లో జట్టు స్కోరు 116 వద్ద హర్మన్ వెనుదిరిగింది. ఆఖరి 5 ఓవర్లలో భారత్.. 32 పరుగులు మాత్రమే చేయగలిగింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో మాజీ ఛాంపియన్ వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది.



# చిన్నారి కోరిక తీర్చిన అల్లు అర్జున్

హైదరాబాద్, జూన్ 20,

స్టార్ హీరో అల్లు అర్జున్ లుకేమియాతో బాధపడుతున్న చిన్నారి శ్రద్ధ కోరికను తీర్చి మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. మేక్-ఎ-విష్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చిన్నారిని కలిసిన అల్లు అర్జున్, ఆమెతో కలిసి 'పుష్ప' సినిమాలోని పాపులర్ మూమెంట్స్‌ను రీక్రియేట్ చేశారు. ఈ హృదయాన్ని హత్తుకునే వీడియోను అల్లు అర్జున్ బృందం సామాజిక మాధ్యమాల్లో పంచుకోగా, అది ప్రస్తుతం వైరల్‌గా మారింది. వీడియోలో అల్లు అర్జున్ నవ్వుతూ "హాయ్ శ్రద్ధా.. ఎలా ఉన్నావ్?" అంటూ చిన్నారిని పలకరించారు. అనంతరం 'పుష్ప' సినిమాలోని ఐకానిక్ డైలాగ్ చెప్పాలని ప్రోత్సహించారు. ఇద్దరూ కలిసి పుష్ప సిగ్నేచర్ గడ్డం తడుముకునే స్టెప్ చేయగా, అల్లు అర్జున్ చప్పట్లు కొడుతూ "చాలా క్యూట్" అంటూ చిన్నారిని అభినందించారు. అనంతరం "నువ్వు పూర్తిగా కోలుకున్న తర్వాత హైదరాబాద్‌కు రావాలి" అని ఆమెకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా "పెద్దయ్యాక ఏమవ్వాలని అనుకుం టున్నావ్?" అని అల్లు అర్జున్ అడగగా, శ్రద్ధ "డాక్టర్ అవ్వాలి" అని బదులిచ్చింది. ఈ సంభాషణ నెటిజన్లను భావోద్వేగానికి గురి చేస్తోంది. ఇదిలా ఉంటే, అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ ఎంటర్‌టైనర్ 'రాకా' చిత్ర షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి దీపికా పదుకొణె కీలక పాత్రలో నటిస్తున్నారు.





# రుక్మిణి వసంత్ డీప్‌ఫేక్ కేసులో ముగ్గురు అరెస్ట్

బెంగళూరు, జూన్ 20


కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కృత్రిమ మేధతో తయారు చేసిన మార్ఫ్ చేసిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకున్నారనే ఆరోపణలపై బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నటి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులు కృత్రిమ మేధ సాధనాలను ఉపయోగించి అభ్యంతరకర దృశ్యాలను సృష్టించి వాటిని ఆన్‌లైన్‌లో ప్రచారం చేశారని గుర్తించారు. ఈ వ్యవహారంలో మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రుక్మిణి వసంత్‌కు సంబంధించిన బికినీ ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. అవి పూర్తిగా నకిలీవని, తన పరువుకు భంగం కలిగించే ఉద్దేశంతో తయారు చేసి ప్రచారం చేస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దృశ్యాలు పూర్తిగా కృత్రిమంగా సృష్టించినవేనని, ప్రజలు వాటిని నమ్మవద్దని ఆమె స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నటి ఫిర్యాదు అనంతరం బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు కేసును వేగంగా ముందుకు తీసుకెళ్లారు. ప్రారంభ దశలో పలువురు సామాజిక మాధ్యమ ఖాతాలపై కేసు నమోదు చేసి, ఆ ఖాతాల వివరాల కోసం సంబంధిత వేదికలకు సమాచారం కోరారు.



# కొత్త కథతో ఆకట్టుకున్న 'దీవాన'

హైదరాబాద్, జూన్ 20

కొత్త నటీనటులతో తెరకెక్కిన ప్రేమకథా చిత్రం 'దీవాన' ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. గత రెండు నెలలుగా వినూత్న ప్రచారంతో ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం, భావోద్వేగాలు, స్నేహం, కుటుంబ బంధాలు, ప్రేమ గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూ ముందుకు సాగుతుంది. డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం లేకుండా స్నేహితులతో సరదాగా తిరిగే మున్నా అనే యువకుడు అమూల్య అనే యువతిని ప్రేమిస్తాడు. అయితే ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తర్వాతే తన ప్రేమను అంగీకరిస్తానని అమూల్య షరతు పెడుతుంది. ఆ తర్వాత మున్నా జీవితంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి? అతడు తన ప్రేమను గెలుచుకున్నాడా? అనే ప్రశ్నలకు సమాధానమే సినిమా కథ. దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి కొత్త కథను ఆసక్తికరంగా మలచడంలో విజయం సాధించారు. ముఖ్యంగా విరామానికి ముందు వచ్చే మలుపు, చివరి భాగంలోని భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. స్నేహం, తల్లిదండ్రుల ప్రేమ, నిజమైన ప్రేమ విలువను ఎక్కడా విసుగు కలగకుండా వినోదాత్మకంగా చెప్పడంలో దర్శకుడి ప్రతిభ కనిపిస్తుంది. మున్నా పాత్రలో హర్షిత్ రెడ్డి సహజమైన నటనతో మెప్పించాడు. సరదా సన్నివేశాలతో పాటు భావోద్వేగ సన్నివేశాల్లోనూ మంచి నటన కనబరిచాడు. అమూల్య పాత్రలో స్నేహ మణిమేగలై ఆకట్టుకుంది. మధ్యతరగతి తండ్రి పాత్రలో నటుడు నరేశ్ మరోసారి తన అనుభవాన్ని చూపించారు. మిగతా నటీనటులు కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. కథ, కథనం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవగా, నేపథ్య సంగీతం, ఛాయాగ్రహణం కూడా సినిమాకు బలాన్ని చేకూర్చాయి. ప్రచారం పరంగా మరింత బలంగా వెళ్లి ఉంటే ఈ చిత్రానికి మరింత ఆదరణ లభించే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.






# జూలై 3న 'నాగబంధం' విడుదల

హైదరాబాద్, జూన్ 20,

నటుడు విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పీసీఎక్స్ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను ఆవిష్కరించారు. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, కథనాన్ని అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ట్రైలర్‌లో కనిపించిన విజువల్ ఎఫెక్ట్స్, పురాతన ఆలయాల నేపథ్యం, గ్రాఫిక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తెలుగు సాంకేతిక నిపుణులే అన్ని విజువల్ ఎఫెక్ట్స్‌ను రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం, చారిత్రక అంశాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని మైథాలజీ అడ్వెంచర్‌గా తెరకెక్కించారు. ఈ చిత్రంలో విరాట్ కర్ణ మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ ఓ పవర్‌ఫుల్ పాత్రలో మెరవనున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకులు జునైద్ కుమార్, అబీ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు మరింత హైప్ తీసుకొచ్చింది. సినిమా విజువల్‌గా, సాంకేతికంగా ప్రేక్షకులకు థియేటర్లలో గ్రాండ్ అనుభూతిని అందిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాల వెనుక ఉన్న చరిత్రను తర్వాతి తరాలకు తెలియజేసే ప్రయత్నమే ఈ చిత్రమని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం జూలై 3న తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సోషల్ మీడియాకు కయాదు లోహర్ విరామం

చెన్నై, జూన్ 20

ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. శరీరానికి విశ్రాంతి అవసరమైనట్టే మనసుకూ విశ్రాంతి అవసరమని పేర్కొంటూ, కొంతకాలం డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు అభిమానులకు తెలిపారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకున్న సందేశంలో కయాదు, "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకూ అవసరం. కాస్త నెమ్మదిగా జీవిస్తూ, స్క్రీన్‌కు అవతల ఉన్న నిజమైన జీవితంతో, నాతో నేను మరింత సమయం గడపాలని అనుకుంటున్నాను" అని పేర్కొన్నారు. తనకు ఎప్పటికప్పుడు మద్దతుగా నిలిచిన అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన ఆమె, "మీ ప్రేమ, మీ సందేశాలు నాకు ఎంతో విలువైనవి. కొంతకాలం నేను ప్రత్యక్షంగా సోషల్ మీడియాలో కనిపించకపోయినా, ముఖ్యమైన అప్‌డేట్స్ ఏవైనా ఉంటే నా బృందం ఇదే ఖాతా ద్వారా పంచుకుంటుంది" అని వెల్లడించారు. అందరూ శాంతి, సంతోషం, దయతో ఉండాలని కోరుతూ, త్వరలో మళ్లీ కలుద్దామని పేర్కొన్నారు. ఇటీవలే తన తమ్ముడు ఉదయ్ పుట్టినరోజు సందర్భంగా కయాదు ఒక భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. "నువ్వు ఎంత పెద్దవాడైనా, నా దృష్టిలో ఎప్పటికీ చిన్నవాడివే. జీవితంలో ఏదైనా అయ్యే ముందు నేను మొదట అక్కనయ్యాను" అంటూ ఆమె రాసిన సందేశం అభిమానులను ఆకట్టుకుంది. తమ్ముడిపై తన ప్రేమను సరదాగా వ్యక్తం చేస్తూ, "నిన్ను తప్ప నా తమ్ముడిని ఎవరూ ఇబ్బంది పెట్టడానికి వీల్లేదు" అని కూడా పేర్కొన్నారు. సినిమాల విషయానికి వస్తే, కయాదు లోహర్ ప్రస్తుతం జీవీ ప్రకాశ్ కుమార్ సరసన 'ఇమ్మోర్టల్' అనే హారర్ థ్రిల్లర్‌లో నటిస్తున్నారు. మరియప్పన్ చిన్న దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కయాదు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని ఇటీవల ప్రకటించారు. విడుదలైన టీజర్‌కు కూడా మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో జీవీ ప్రకాశ్, కయాదు లోహర్‌లతో పాటు టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. హారర్, థ్రిల్లర్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమా కయాదు కెరీర్‌లో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే కయాదు ఈ నిర్ణయం తీసుకోవడం అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే వ్యక్తిగత ప్రశాంతత, మానసిక విశ్రాంతి కోసం ఆమె తీసుకున్న ఈ విరామాన్ని అభిమానులు గౌరవిస్తున్నారు. కొంత విరామం తర్వాత ఆమె మళ్లీ కొత్త ఉత్సాహంతో సోషల్ మీడియాలోకి వస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.